నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు

- రైతులకు అందని సమాచారం
- పట్టించుకోని పాలకులు.. అధికారులు

బాపట్లటౌన్: గతంలో అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతులకు వెన్నదన్నుగా నిలిచింది. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతులను ఆర్థికంగా ఆదుకుంది. రైతు సంక్షేమం అంటే ఎలా ఉంటుందో చేతల్లో చూపించింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్దకే అన్ని రకాల సేవలు చేర్చింది. విత్తనం నుంచి పంట విక్రయం వరకు అన్నదాతలకు అండగా నిలబడాలని ప్రతి పంచాయతీలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించేవారు. రైతు భరోసా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రం ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఆ తర్వాత ఎవరికి ఏ రకం కావాలో తెప్పించే పరిస్థితి ఉండేది.

మండలంలో 21 ఆర్బీకేలు

బాపట్ల మండలంలోని 25 పంచాయతీల పరిధిలో 21 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వాటిలో 21 కియోస్క్ యంత్రాలను రైతులకు అందుబాటులో ఉంచారు. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో



నిరుపయోగంగా మారిన రైతు సేవా కేంద్రంలోని కియోస్క్

రైతులకు సేవలు అందించేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి కియోస్క్ యంత్రాలు కొనుగోలు చేసింది.

● విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు, రైతుల పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెట్ వివరాలు, తదితర అవసరమైన అన్ని సేవలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుంది. కచ్చితమైన సమాచారంతో నాడు రైతులకు వ్యవసాయ శాఖ అన్ని విధాలా సేవలందించింది. వాతావరణ సమాచారం, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందు పరిచారు.

● నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు ప్రస్తుతం నిరూపయోగంగా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న కియోస్క్ సేవలను ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దూరం చేయడంపై రైతుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

సేవలకు స్వస్తి

కూటమి ప్రభుత్వ హయాంలో రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. ప్రస్తుతం సాంకేతిక లోపంతో కియోస్క్ యంత్రాలు పనిచేయడం లేదు. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుండగా కియోస్క్ యంత్రాలు నిరూపయోగంగా మారుతున్నాయి. కొన్ని చోట్ల వీటిని పూర్తిగా విస్మరించడంతో విలువైన యంత్రాలు మూలనపడ్డాయి. మరికొన్ని చోట్ల నెట్ సేవలు అందక పనిచేయడం లేదు. గతంలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేవారు. ప్రస్తుతం రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటున్నారు. ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చినా సేవల కొనసాగింపులో మాత్రం కూటమి ప్రభుత్వం వివక్ష చూపిస్తోంది. ఆర్బీకేల సేవలకు స్వస్తి పలికింది. ఫలితంగా ఆర్బీకేల లక్ష్యం నీరు గారింది.

హైవే పనులతో నెట్ సేవలు నిలిచాయి

రైతు సేవా కేంద్రాలకు ఫైబర్‌నెట్ కనెక్షన్ అందుబాటులో ఉంది. హైవే పనులు జరిగే సమయంలో ఫైబర్‌నెట్‌కు సంబంధించిన వైర్లు దెబ్బతిన్న కారణంగా రైతు సేవా కేంద్రాలకు కొన్ని ప్రాంతాల్లో సేవలు నిలిచాయి. గ్రామాల్లోని వ్యవసాయ సహాయకులు హాట్‌స్పాట్ ద్వారా సేవలను ఉపయోగిస్తున్నారు. కియోస్క్ యంత్రాలను ఎరువులు, పురుగు మందుల సీజన్‌లో ఉపయోగిస్తాం.

– చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి

దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ



బాపట్ల: రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ కార్యక్రమం ఆదివారం రోటరీ క్లబ్‌లో చేపట్టింది. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఉపేంద్రగుప్త, కార్యదర్శి వేజండ్ల శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇమ్మడిశెట్టివారిపాలెం, డ్రైవర్స్ కాలనీ, మరుప్రోలువారిపాలెంకు చెందిన ఐదుగురు దివ్యాంగులకు రూ.50 వేలు విలువ చేసే వీల్‌చైర్లను అందించామని తెలిపారు. రోటరీక్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ నార్త్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి, రోటరీ బాపట్ల అధ్యక్షుడు ఉపేంద్ర గుప్త సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సీనియర్ సభ్యులు బూర్లె రామసుబ్బారావు, కొత్త ఆంజనేయవరప్రసాద్ ఉన్నారు.

క్లుప్తంగా

ఎండ వేడిమి నుంచి ఉపశమనం

రేపల్లె : ప్రచండ భానుడి భగభగల నుంచి వర్షం కొంత ఉపశమనం కలిగించింది. గత నెల రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు అధికమవడంతో తీర ప్రాంత ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ఆదివారం 11 గంటల వరకు ఎండ వేడిమి అధికంగా ఉండగా ఒక్కసారిగా వాతావరణం చల్లబడి అరగంటకు పైగా వర్షం కురిసింది. వర్షంతో పాటు ఈదురు గాలులు వీయటంతో పట్టణంలో రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు.

వైభవంగా తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల



బాపట్ల: జమ్ములపాలెం త్రిశక్తి ఆలయంలో తిరుపతమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు, పూలతో అలంకరణ, ప్రత్యేక పూజలు, పొంగళ్ల నైవేద్యం చేపట్టారు. సాయంత్రం కనక తప్పెట్లు, మేళ తాళాలు, విచిత్ర వేషధారణలతో, విద్యుత్ వెలుగులతో గోవింద నామ స్మరణతో విద్యుత్ ప్రభను మహిళలచే లాగించారు. భక్తులు వేలాదిగా పాల్గొని పూజలు చేపట్టారు.

ఘనంగా కాళికాంబ కొలుపులు



కర్లపాలెం: కర్లపాలెం మండల కేంద్రంలో వేంచేసియున్న వీరభద్రస్వామి సమేత కాళికాంబ అమ్మవారి కొలుపులు ఘనంగా జరిగాయి. అమ్మవారి ఆలయ వార్షిక కొలుపులు గత మూడురోజులుగా ఘనంగా నిర్వహించారు. తొలిరోజు భక్తులు మంగళవాయిద్యాలతో బిందెలతో నీరు తీసుకువచ్చి అమ్మవారి విగ్రహాలకు అభిషేకాలు చేశారు. రెండవ రోజు ఏత్రవారిపాలెం గ్రామం నుంచి భక్తులు పసుపు బండ్లపై ఆలయానికి చేరుకుని అమ్మవారికి పూలు, పండ్లు, పసుపు కుంకుమలు సమర్పించి విశేష పూజలు చేశారు. మూడవ రోజు ఆదివారం అమ్మవారి భక్తులు ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా వెంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



కోమలి(కర్లపాలెం): గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కంబాలవారి వంశస్తుల ఇలవేల్పు వెంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా ఆలయం వద్ద శాంతి హోమాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అమ్మవారి విగ్రహాలను దర్శించుకుని పూజలు చేసి ప్రసాదాలను స్వీకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



తెనాలి అర్బన్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ ఆంజనేయ యోగా కేంద్రం వ్యవస్థాపకులు కిశోర్ గురూజీ పేర్కొన్నారు. యోగా కేంద్రం ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని చుండూరు వారి సత్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన చిన్న పిల్లల యోగా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో ఎక్కువ మంది మానసిక ఒత్తిడితో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అనేక శారీరక రుగ్మతల నిర్మూలనకు యోగా దోహదపడుతుందని చెప్పారు. అనంతరం దాత విక్రమ్ సహకారంతో చిన్నారులకు ఆట వస్తువులు, అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగా సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, ముంత లక్ష్మి, సూర్యనారాయణ, సుబ్బారావు, రేఖ, కోమల, రాంబాబు, మధు, సంపూర్ణ పాల్గొన్నారు.

వేట నిషేధిత సమయం సద్వినియోగం చేసుకుంటున్న మత్స్యకారులు



పడవకు మరమ్మతులు చేస్తున్న మత్స్యకారులు



నిజాంపట్నం హార్బర్‌లో జెట్టి వద్దకు చేరిన బోట్లు

చురుగ్గా మరమ్మతుల పనులు

రేపల్లె : చేపల వేట నిషేధిత సమయాన్ని రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం తీర ప్రాంత మత్స్యకారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. సముద్రంలో మత్స్య సంపద ఉత్పత్తి కోసం చేపల వేట నిషేధం అమల్లో ఉండటంతో మత్స్యకారులు తమ బోట్లకు, వలలకు మరమ్మతులు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పడవలను ఒడ్డుకు చేర్చుకొని వాటికి అవసరమైన మరమ్మతులు నిర్వహించుకోవడం, రంగులు వేసుకోవడం వంటి పనులను చురుగ్గా చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజులపాటు సముద్ర వేటను నిషేధించడం జరుగుతుంది. వేట నిషేధిత



మరమ్మతులకు షెడ్డులో సిద్ధంగా ఉన్న వలలు

సమయంలో సముద్రంలో మత్స్య సంపద ఉత్పత్తి ఘనంగా పెరుగుతుంది. జూన్ 15వ తేదీ నుంచి మత్స్యకారులు సముద్రపు వేటకు బయల్దేరతారు. ప్రస్తుతం నిజాంపట్నం హార్బర్‌లో 250 బోట్లు, 500 ఇంజన్ పడవలు, 1000 నాటు పడవలు ఉన్నాయి. వీటిని ఒడ్డుకు చేర్చుకుని అవసరమైన వాటికి శరవేగంగా మరమ్మతులు చేసుకుంటున్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రేపల్లె : హనుమంతుని స్ఫూర్తిగా హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ కోరారు. చెరుకుపల్లిలోని పోలేరమ్మ తల్లి ఆలయంలో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ మండల కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సత్యనారాయణ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానములు, సమరసత సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని చెప్పారు. ఈ నెల 10వ తేదీ రెండో శనివారం గ్రామాలలోని ఆలయాలలో సత్సంగం, 23న ఏకాదశి నగర సంకీర్తనలు నిర్వహించాలని పేర్కొన్నారు. 22వ తేదీ హనుమాన్ జయంతి



ఉత్సవాలు నిర్వహించాలన్నారు. వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని 12న అన్ని దేవాలయాల్లో సామూహిక హారతులు జరపాలన్నారు. సమావేశంలో సమరసత సేవ ఫౌండేషన్ సభ్యులు పడమట వెంకటేశ్వరరావు, ఉల్లంగుంట సాంబశివరావు, తాడివాక సామ్రాజ్యం, శంకర్ దీక్షితులు, సరస్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తులసి నాట్లు

బాపట్ల: మండలంలో తులసి సాగుకు పూల రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. బోర్ల కింద మెరక ప్రాంతాల్లో పూల తోటలు, ఆకుకూరాల సాగుతోపాటు తులసి, లైన్ ఆకు సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. కొద్దిరోజులలో పూల సీజన్ ముగిసిపోతుండటంతో తులసి మాలలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు తులసి నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని వెదుళ్ళపల్లి, స్టువార్టుపురం, దరివాదకొత్తపాలెం, కుక్కలవారిపాలెం తదితర గ్రామాల్లో రైతులు తులసి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. కొద్దిరోజులు బోరు నీటితో నాట్లు పూర్తి చేసుకుంటే జూన్‌లో కురిసే వర్షాలతో పైర్లను బతికించుకోవచ్చనే ఆశతో తులసి నాట్లతోపాటు మరువం, లైన్ ఆకు, ఆకుకూరలు సాగుకు



వెదుళ్ళపల్లిలో తులసి నాట్లు వేస్తున్న మహిళలు

శ్రీకారం చుట్టారు. దీంతో కూలీలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. రోజుకు ఒక్కో మహిళకు రూ.250 నుంచి రూ.300 వరకు డిమాండ్ చేస్తున్నారు. 30 సెంట్లలో తులసి నాట్లు వేయడానికి సుమారు రూ.9 వేలు ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలకు కోన పరామర్శ

కర్లపాలెం: మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన దబ్బుకూటి బిక్షాలు(60) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం జరిగిన బిక్షాలు పెద్ద కర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెదగొల్లపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లావుల వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందటంతో ఆయన కుటుంబ సభ్యులను కోన రఘుపతి పరామర్శించారు. కోన వెంట వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, పార్టీ నాయకులు



చిక్కాల సాగర్, రత్తయ్యబాబు తదితరులు ఉన్నారు.

రహదారులపై చెట్ల తొలగింపు



కొల్లూరు : గాలులతో కూడిన వర్షం కారణంగా ప్రజలు, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు గ్రామ సర్పంచ్‌లు నడుం కట్టారు. ఆదివారం బలమైన గాలులతో కూడిన వర్షం కురవడంతో మండలంలోని తోకలవారిపాలెం, భట్టిప్రోలు మండలం వెల్లటూరు మార్గంలో రహదారులకు అడ్డంగా చెట్లు కూలాయి. వృక్షాలు రోడ్లపై పడిపోవడంతో, ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతుండటంతో భట్టిప్రోలు సర్పంచి ధార రవికిరణమై, తోకలవారిపాలెం సర్పంచ్ టి.కృష్ణమోహన్ స్థానిక యువకుల సహకారంతో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. చెట్లను తొలగించి రాకపోకలు సజావుగా సాగేలా కృషి చేశారు.

కేజీఎఫ్ కార్యాలయం ప్రారంభం

తెనాలి: కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) తెనాలి కార్యాలయాన్ని ఆదివారం ఇక్కడి ప్రకాశం రోడ్డులోని కాంప్లెక్సులో ప్రారంభించారు. కేజీఎఫ్ వ్యవస్థాపకుడైన జెట్టి కుసుమకుమార్ ఆదేశాలపై ఆ సంస్థ తెనాలి అధ్యక్షుడిగా జెట్టి శివరామకృష్ణప్రసాద్ ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. భవిష్యత్‌లో కమ్మ సామాజిక వర్గానికి అందించాల్సిన తోడ్పాటుపై ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలిపారు. జెట్టి నాగభూషణం, జెట్టి నాగేశ్వరరావు, తుమ్మల బాపయ్య చౌదరి, అంకినీడు, శంకరప్రసాద్, ప్రవీణ్, సాయి, గిరీష్ పాల్గొన్నారు.

దర్శకుడు దాసరి గొప్ప దార్శనికుడు

సినీ దర్శకుడు దిలీప్ రాజా

తెనాలి అర్బన్: సినీ దర్శకుడు దాసరి నారాయణరావు గొప్ప దార్శనికుడని మా ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్ రాజా పేర్కొన్నారు. ఆలపాటి నగర్‌లోని మా ఏపీ కార్యాలయంలో దాసరి నారాయణరావు జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దిలీప్ రాజా మాట్లాడుతూ దాసరి నిర్మించిన అనేక సినిమాలు సంవత్సరం పైగా థియేటర్లలో ప్రదర్శనకు నోచుకోవడం తెలుగు ప్రజలకు గర్వకారణమని తెలిపారు. ప్రేమాభిషేకం, మేఘ సందేశం సినిమాలు తెలుగు సినిమా బతికున్నంత కాలం చెక్కుచెదరని జ్ఞాపకంగా ఉంటాయని పేర్కొన్నారు. నటుడు మిలటరీ ప్రసాద్ మాట్లాడుతు పాలకొల్లు నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన ఆయన నేటితరం దర్శకులకు రోల్ మోడల్



దాసరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దిలీప్ రాజా

అన్నారు. దర్శకుడు మణివరన్ మాట్లాడుతూ 150కి పైగా సినిమాలకు దర్శకత్వం చేసిన ఆయన గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించి, దర్శకత్వ శాఖను ఎవరెస్ట్ శిఖరంపై ఎక్కించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు షేక్ మస్తాన్ వలి, నటులు బసవరత్న, సురేష్, మీరావలి పాల్గొన్నారు.

ఐఏఎస్‌లు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు

తెనాలి: సివిల్ సర్వీస్ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ 'కళారత్న' అవార్డు గ్రహీత నందివెలుగు ముక్తేశ్వరరావు అన్నారు. కొందరు అధికారులు ప్రజల పట్ల తమ బాధ్యతను మర్చిపోతుంటారని వ్యాఖ్యానించారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మానవత, తెనాలి శాఖ ఏప్రిల్ నెల సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. సంస్థ తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి నందివెలుగు ముక్తేశ్వరరావు 'అడ్మినిస్ట్రేటర్-సోషల్ రెస్పాన్సిబిలిటీ' అనే అంశంపై మాట్లాడారు. పబ్లిక్ రెస్పాన్సిబిలిటీ అనేది అధికారులకు పెద్ద బాధ్యతగా చెప్పారు. దాన్ని తీసుకున్నవాళ్లు తగిన సామర్థ్యంతో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. సామర్థ్యం అనేది బాధ్యతకు విశ్వసనీయమైన ప్రమాణంగా చెప్పారు. సామర్థ్యం కలిగిన వాళ్లకే విజన్ ఉంటుందన్నారు. గొప్ప విషయాలను సాధించడం విజన్ కాదనీ, ఉన్న వనరులతోనే తగిన ప్రణాళికతో కోరుకున్నదానిని సాకారం చేసుకోవడం విజన్‌గా చెప్పారు. బాధ్యతను తెలుసుకోవటమంటే దాన్ని నెరవేర్చేందుకు తగిన ప్రణాళికను రచించడం కూడా తెలిసుండాలని సూచించారు. ఏదేమైనా అధికారులు ప్రజల అవసరాలు, ఆసక్తులను కాపాడాల్సి ఉందని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించినపుడు ఐఏఎస్ వ్యవస్థ ఉండాలా? వద్దా? అనే చర్చ నుంచి ఆరంభించి, సివిల్ సర్వీస్ బాధ్యతలు, అందులోని తన అనుభవాలను ముక్తేశ్వరరావు విశదీకరించారు. మానవత రీజియన్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గొప్పవారి అనుభవాలు ఇతరులకు స్ఫూర్తినిస్తాయని చెప్పారు. డాక్టర్ రామ్‌చంద్ మాట్లాడుతూ విదేశాల్లో గొప్ప విజయాలను సాధించినవారి జీవిత చరిత్రలు పుస్తకాలుగా వస్తాయని, ఇక్కడ ముక్తేశ్వరరావు జీవిత విశేషాలను ఇతరులు పుస్తకంగా తేవడం గొప్ప అంశమని తెలిపారు. సభలో విజ్ఞాన వేదిక ఆర్థిక సహకారంతో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు రచించిన 'సూక్తి నిధి' పుస్తకాన్ని ముఖ్య అతిథి ముక్తేశ్వరరావు ఆవిష్కరించారు. తొలుత పాలడుగు ఆనందయ్య ముక్తేశ్వరరావును పరిచయం చేశారు. కార్యక్రమంలో మానవత ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, ఎస్‌వీ శాస్త్రి పాల్గొన్నారు.



ముక్తేశ్వరరావును సత్కరిస్తున్న కొత్త సుబ్రహ్మణ్యం, రామ్‌చంద్

వేసవి దుక్కులకు శ్రీకారం

బాపట్ల: గతేడాది వ్యవసాయ సాగు ఆశించిన మేర అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది కూడా ఈశాన్య రుతుపవనాలు ముందస్తుగానే వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేయటంతో రైతులు వేసవి దుక్కులు దున్నేందుకు సన్నద్ధం అయ్యారు. రబీ పంటలుగా సాగుచేసిన మొక్కజొన్న, జొన్న, మినుము పైర్ల చెత్తను పొలాల్లో తగలబెట్టే పనుల్లో రైతులు నిమగ్నం అయ్యారు. అదేవిధంగా గతంలో బీడు భూములుగా వదిలేసిన కాలువ శివారు భూములను సైతం ఈ ఏడాది సాగులోకి తెచ్చేందుకు రైతులు కృషి చేస్తున్నారు. వ్యవసాయం చేయాలంటే కనీసం నాలుగు నుంచి ఐదు సార్లు దుక్కిదున్నించాల్సి వస్తుందనే ఉద్దేశంతో దుక్కులను ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో దున్నుకుంటే కలుపుజాతి గడ్డి మొత్తం మాడిపోతుందనే ఆశతో రైతులు దుక్కులు దున్నేందుకు సన్నద్ధం అయ్యారు. మండలంలోని ముత్తాయపాలెం, మచ్చావారిపాలెం, ఇమ్మడిశెట్టివారిపాలెం, మరుప్రోలువారిపాలెం, పాండురంగాపురం, జిల్లెళ్ళమూడి, చుండూరుపల్లి, అప్పికట్ల, భర్తిపూడి, కంకటపాలెం, బేతపూడి గ్రామాల్లో వ్యవసాయ పనులను ప్రారంభిస్తున్నారు.



వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

అన్నమయ్య పాటల పోటీలకు స్పందన

తెనాలి: శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 617వ జయంతి సందర్భంగా, శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వెనుక ఉన్న గీతా మందిరంలో అన్నమయ్య పాటల పోటీలను నిర్వహించారు.జూనియర్ విభాగంలో 60 మంది, సీనియర్ విభాగం నుంచి 40 మంది పాల్గొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంగీత విభాగం అధిపతి చింతలపాటి మంజుల న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పిల్లల్లో భక్తి భావం పెరగడానికి, అన్నమయ్య సంకీర్తన ప్రచార నిమిత్తమే ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు చెప్పారు. విజేతలను తిరుమల లేదా ద్వారకా తిరుమల తీసుకుని వెళ్లి స్వామి దర్శనం చేయించి, అక్కడ సంకీర్తన చేయిస్తామని తెలిపారు. కొండపి వసుంధర, ఉప్పలూరు శారద, లక్కరాజు కనకదుర్గ, వీరంశెట్టి లక్ష్మీ రజిని, కారంపూడి రమాదేవి, తల్లం సావిత్రి, అందే బాలచంద్రమౌళి పాల్గొన్నారు.



పాటల పోటీలో పాల్గొన్న చిన్నారులు

ముగిసిన వేద విద్యార్థుల పరీక్షలు

కొల్లూరు : వేద విద్యార్థులకు 101వ వేద పరీక్షల నిర్వహణ కార్యక్రమం ఆదివారంతో ముగిసినట్లు నిర్వహణ కార్యదర్శి తాడేపల్లి వెంకట సింహాద్రి శాస్త్రి తెలిపారు. ఈ నెల 2 నుంచి కొల్లూరులోని పార్వతీ సంస్కృత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలు ముగిసాయన్నారు. వేద పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులతో పరీక్షల అనంతరం అధ్యాపకులు పండిత ప్రకర్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థుల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి సోమవారం ధ్రువపత్రాల పంపిణీతోపాటు, వేద స్వస్తి, వేద పండితుల సన్మాన సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



పండిత ప్రకర్ష కార్యక్రమంలో వేద విద్యార్థులతో అధ్యాపకులు